అవిశ్వాసానికి కాంగ్రెస్ తెర..

- కుసంస్కారానికి పరాకాష్ట.. నేటి పాలకుల తీరు
- అధికారమే లక్ష్యంగా.. కార్పొరేటర్లు, కౌన్సిలర్లలో ప్రలోభాలు
- పది నెలల పదవీ కాలం ఉన్నప్పటికీ.. ముందస్తుగా లాక్కొనే యత్నం



మేడ్చల్, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన మొదలైనప్పటి నుంచి దుష్ట, దుర్మార్గపు పోకడలకు తెర లేచినట్టు అయ్యింది. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని శివారు ప్రాంత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రస్తుత మేయర్లు, మున్సిపల్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలకు కాంగ్రెస్ తెర లేపుతోంది. ఇటీవలే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీలలో అధికారమే లక్ష్యంగా అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టే ప్రయత్నాలు జోరుగా చేస్తుంది. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో 13 మున్సిపాలిటీలు ఉండగా, ఇందులో 13 మున్సిపాలిటీలను అప్పట్లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. మున్సిపాలిటీల పాలకవర్గం పదవీ కాలం వచ్చే ఏడాది జనవరి నాటికి ముగియనుంది. అయినప్పటికి మున్సిపాలిటీలలో అధికారం పొందేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రస్తుతం ఉన్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లను చీల్చే విధంగా వారిపై ఒత్తిడి తెస్తున్నారు. అంతే గాక వారిని ప్రలోభాలకు గురి చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే వివిధ మున్సిపాలిటీల పాలకవర్గాలపై అవిశ్వాస తీర్మానాలకు తెర లేపగా జవహర్‌నగర్ కార్పొరేషన్ బీఆర్ఎస్ మేయర్ కావ్యపై అవిశ్వాసం నెగ్గిన విషయం తెలిసిందే.

లోక్‌సభ ఎన్నికల దృష్టిలో..

త్వరలోనే రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి అవిశ్వాస తీర్మానాలు కాంగ్రెస్ చేస్తుందన్న ఆరోపణలు మెండుగా వినిపిస్తున్నాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్పటి మల్కాజిగిరి ఎంపీగా ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శివారు ప్రాంత మున్సిపాలిటీల్లో ఒక్క మున్సిపాలిటీనైనా కాంగ్రెస్ పార్టీ గెలువలేకపోయింది. అయితే, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో బీఆర్ఎస్ అభ్యర్థులే గెలుపొందారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాన్ని గెలుపొందాలంటే కాంగ్రెస్ పార్టీకి కష్ట సాధ్యమైన పనిగా మారింది. పార్లమెంట్ పరిధిలో బలమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నందున మున్సిపాలిటీల పాలకవర్గంలో ఉన్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లను చీల్చి కాంగ్రెస్ వైపు లాక్కొనే ప్రయత్నాలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏడుగురు ఎమ్మెల్యేలైన చామకూర మల్లారెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, కేపీ వివేకానంద్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, సుధీర్‌రెడ్డి, లాస్య నందితలు భారీ మెజార్టీలతో గెలుపొందిన క్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉందన్న సంకేతాలు కనపడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలని, ఇలాంటి ప్రయత్నాలు చేస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీలకు మరో 10 నెలలు మాత్రమే గడువు ఉన్నప్పటికీ అవిశ్వాస తీర్మానాలు కాంగ్రెస్ పెట్టించడంతో మున్సిపాలిటీలలో పరిపాలన సరిగా సాగడం లేదన్న ఆరోపణలను కాంగ్రెస్ ఎదుర్కొంటుంది. అవిశ్వాస తీర్మానాలకు తెర లేపిన నేపథ్యంలో క్యాంపుల పేరిట స్థానికంగా కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఉండలేక పోతున్నారు.

సంధ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, చిత్రంలో తదితరులు

సంధ్య కుటుంబ సభ్యులకు పరామర్శ..

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 20: ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) జాతీయ కన్వీనర్ వి.సంధ్య, భర్త రామకృష్ణారెడ్డి (62)లు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు టి.హరీశ్ రావు, వి.శ్రీనివాస్ గౌడ్ మంగళవారం హిమాయత్‌నగర్‌లోని సంధ్య నివాసానికి వచ్చి ఆమెను పరామర్శించారు. అనంతరం రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు గట్టు రాంచందర్, శ్రీధర్, సత్యవతి, సర్ఫరాజ్, పాలడుగు శ్రీనాథ్, నందు, సామాజిక విశ్లేషకురాలు సజయ తదితరులు ఉన్నారు.

సికింద్రాబాద్ పీజీ కాలేజీ వద్ద రక్షణ చర్యలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్ ప్యారడైజ్ సర్కిల్‌లో ఉన్న పీజీ కాలేజ్ వద్ద రక్షణ చర్యలు చేపట్టేందుకు హైదరాబాద్ మెట్రో రైలు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్యారడైజ్ మెట్రో స్టేషన్ పరిసర ప్రాంతమంతా నిత్యం ఎంతో రద్దీగా ఉంటోంది. మెట్రో స్టేషన్‌ను ఆనుకొని కళాశాల ప్రహరీగోడ ఉండటంతో భద్రతాపరమైన సమస్యలు ఎదురవుతున్నాయి. అపరిచిత వ్యక్తులు ప్రహరీగోడ దూకి వెళ్లకుండా అవసరమైన ఏర్పాట్లను చేసేందుకు సుమారు రూ.6.25 లక్షల వ్యయం అంచనాతో ప్రతిపాదనలు రూపొందించి మంగళవారం టెండర్లు పిలిచారు. మార్చి మొదటి వారంలోగా టెండరు ప్రక్రియ పూర్తి చేసి, క్షేత్రస్థాయిలో పనులు చేపట్టనున్నారు.

యాదయ్య త్యాగం మరవలేనిది

- ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

యాదయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సబితారెడ్డి

బడంగ్‌పేట, ఫిబ్రవరి 20: తెలంగాణ ఉద్యమంలో సిరిపురం యాదయ్య త్యాగం మరవలేదని మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరంలో సిరిపురం యాదయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం తన ప్రాణాలను బలి పెట్టిన గొప్ప త్యాగధనుడు యాదయ్య అని అన్నారు. సిరిపురం యాదయ్య త్యాగాన్ని వెలకట్టలేమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు యాదయ్యను ఎప్పటికీ మర్చిపోరన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్ట విరుద్ధమైన బ్లడ్‌బ్యాంక్‌లపై చర్యలు

డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ బీవీ కమలాసన్‌రెడ్డి



సిటీబ్యూరో, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): చట్ట విరుద్ధంగా ఎవరైనా బ్లడ్ బ్యాంక్‌లను నిర్వహించినా, లేక అక్రమాలకు పాల్పడినా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ బీవీ కమలాసన్‌రెడ్డి హెచ్చరించారు. ఔషధాల తయారీ ల్యాబ్‌లు, ఫార్మా కంపెనీలు, మెడికల్ షాపుల నిర్వహణ తదితర వాటిపై నిరంతరం సూక్ష్మ పర్యవేక్షణ పెట్టామని, ఎక్కడ కూడా ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా చర్యలు తీసుకుంటున్నట్లు డీజీ వివరించారు. 'రక్తంతో వ్యాపారం' శీర్షికన మంగళవారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన వార్తకు స్పందించిన డీజీ కమలాసన్‌రెడ్డి 2023లో 26,133 తనిఖీలు నిర్వహించడం జరిగిందని వివరించారు. ఈ తనిఖీల్లో భాగంగా 4,991 ఉల్లంఘనలు జరిగినట్లు గుర్తించి, వారిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అంతే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా బ్లడ్ బ్యాంక్‌లకు సంబంధించి 157 తనిఖీలు చేపట్టామని, అందులో 56 బ్లడ్‌బ్యాంక్‌లను సీజ్ చేసినట్లు వివరించారు. 61 ఔషధ కేసుల్లో కన్విక్షన్ పడే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో చలామని అవుతున్న నాణ్యత లేని 60 ఔషధాలను గుర్తించామని, నిబంధనలు పాటించని ఔషధ తయారీ కేంద్రాలకు 43 సస్పెన్షన్ ఆర్డర్లు జారీ చేశామని, 15 ప్రొడక్ట్ లైసెన్స్‌లను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అంతే కాకుండా రెండు ప్రొడక్ట్ లైసెన్స్‌లను రద్దు చేయడం జరిగిందన్నారు. ఔషధాల ఉత్పత్తిని నిలిపివేయాలంటూ 8 ఔషధ తయారీ కేంద్రాలకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

సిరిపురం యాదయ్యకు ఘన నివాళి



సిరిపురం యాదయ్యకు నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 20: తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన విద్యార్థి అమరుడు సిరిపురం యాదయ్యకు ఉస్మానియా యూనివర్సిటీలో ఘనంగా నివాళులర్పించారు. యాదయ్య 14వ వర్ధంతి సందర్భంగా ఆత్మబలిదానం చేసుకున్న ఓయూ ఎన్‌సీసీ గేటు సమీపంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సంస్మరణ సభ నిర్వహించి, అంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వి. ప్రకాశ్, ప్రొఫెసర్ కోదండరాం, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతం రావు, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యాదయ్య చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. ఆత్మత్యాగం చేసిన ప్రదేశంలోనే యాదయ్య విగ్రహాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ప్రజాప్రతినిధులను కోరారు.

వీ హబ్‌లో ఇన్‌క్లూజన్ ప్రోగ్రాం

- ఎంఎస్ఎంఈలో 34 ఆంత్రప్రెన్యూర్ల సంస్థల నమోదు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): వీ హబ్, రీ సస్టెయినబులిటీ సంయుక్తంగా ప్రాజెక్టు ఇన్‌క్లూజన్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసుకున్న 34 మంది ఔత్సాహిక ఆంత్రప్రెన్యూర్లకు ప్రత్యేక శిక్షణతో పాటు, వ్యాపార మెలకువలపై ఆరు నెలల పాటు అవగాహన కల్పించారు. అనంతరం, వీరి వ్యాపారాలను ఎంఎస్ఎంఈలో రిజిస్టర్ చేశారు. పర్యావరణహితమైన వ్యాపార విధానాలు, వ్యాపార విస్తరణ ప్రణాళికలు, ఆర్థిక ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించినట్లుగా వీ హబ్ వర్గాలు వెల్లడించాయి. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ తరహా ఓరియెంటేషన్ కార్యక్రమాలు సాయపడుతాయని, ఆలోచనకు కార్యరూపంలోకి తీసుకురావడంతో కీలకంగా మారుతుందని తెలిపారు.

ఒడిశాతో ఇఫ్లూ అవగాహన ఒప్పందం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 20: ఒడిశా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఒడిశా స్కిల్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఓఎస్‌డీఏ)తో ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీని ప్రకారం, ఒడిశా యువతకు ఇంగ్లిష్‌తో పాటు విదేశీ భాషా నైపుణ్యాలను ఇఫ్లూ ఆధ్వర్యంలో నేర్పించేందుకు అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా ఇఫ్లూ వీసీ ప్రొఫెసర్ సురభి భారతి మాట్లాడుతూ, ఇంగ్లిష్, విదేశీ భాషల బోధన, శిక్షణ అందించడంలో తమ వర్సిటీ ముందుకు సాగుతుందని చెప్పారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా యువతకు నైపుణ్యాలు పెంపొందించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ ఒప్పందం మూడేళ్ల పాటు అమలులో ఉంటుందని వివరించారు.

ఆంధ్రప్రదేశ్ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని కలిసిన హెచ్‌యూఎల్ లీగల్, కార్పొరేట్ వ్యవహారాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేవ్ బాజ్‌పాయ్, సప్లై చైన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యోగేష్ మిశ్రా, ప్రొక్యూర్‌మెంట్ స్ట్రాటజీ ఇన్‌సైట్స్ మేనేజర్ ప్రఖర్ గుప్తా, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఓఓ భరత్ కుమార్, హెచ్‌యూఎల్ కార్పొరేట్ వ్యవహారాల మేనేజర్ రాతుపర్ణ భయాన్ తదితరులు

పామాయిల్ తోటల పెంపునకు ఏపీతో చర్చలు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 20: ఆంధ్రప్రదేశ్‌లో 30 వేల హెక్టార్లలో పామాయిల్ తోటలను వృద్ధి చేసేందుకు హిందుస్థాన్ యూనీలివర్ లిమిటెడ్ కృషి చేస్తున్నదని హెచ్‌యూఎల్ లీగల్, కార్పొరేట్ వ్యవహారాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దేవ్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. హెచ్‌యూఎల్ సప్లై చైన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యోగేష్ మిశ్రా నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, సహకారం, మార్కెటింగ్, ఉత్పత్తుల ప్రాసెసింగ్ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని మంగళవారం కలిసి పామాయిల్ ఉత్పత్తులను పెంపొందించేందుకు ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని ప్రతిపాదించారు. ఇందులో భాగంగా 15 వేల మంది రైతుల భాగస్వామ్యంతో చేపట్టే పామ్ ఆయిల్ తోటల వృద్ధితో పరోక్షంగా ఒక వెయ్యి మందికి ఉద్యోగావకాశాలు దొరుకుతాయని వెల్లడించారు.

మత్స్యకారులతో ఘనంగా భీష్మ ఏకాదశి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): చిల్కూరు బాలాజీ దేవాలయం గతంలో సనాతన ధర్మానికి చెందిన వివిధ వర్గాలను ఏకీకృతం చేసే ప్రయత్నంలో అనేక సామాజిక సంబంధిత కార్యక్రమాలను నిర్వహించింది. తాజాగా భీష్మ ఏకాదశి వేడుకల్లో భాగంగా సనాతన సంప్రదాయ గంగపుత్రులు మత్స్యకారుల సంఘంతో కలిసి నగరంలోని తిలక్‌నగర్‌లో విష్ణు సహస్రనామ పారాయణం ఘనంగా నిర్వహించారు. గంగ గౌరీశ్వర భజన మండలి తిలక్ నగర్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవంగా సాగింది. చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ భీష్మ పితామహ గొప్పతనాన్ని తెలియజేశారు.

కోఠిలోని డీహెచ్ కార్యాలయం ముందు విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మెడికల్ జాక్ రాష్ట్ర నాయకులు

నిరాధారమైన ఆరోపణలను సహించేది లేదు

మెడికల్ జేఏసీ రాష్ట్ర నాయకులు

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 20: నిజాయితీగా ఉద్యోగుల సంక్షేమం కోసం పనిచేసే అధికారులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని మెడికల్ జేఏసీ రాష్ట్ర నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం కోఠిలోని డీహెచ్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెడికల్ జాక్ రాష్ట్ర నాయకులు బి.వెంకటేశ్వర్ రెడ్డి, యాదనాయక్, నెహ్రూ నాయక్, సుజాత రాథోడ్, రాబర్ట్ బ్రూస్, వేణుగోపాల్ గౌడ్, రామలక్ష్మి, కర్నాటి సాయిరెడ్డిలు మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌పై చేస్తున్న నిరాధార ఆరోపణలను మెడికల్ జాక్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు వివరించారు. కొందరు అధికారులు తప్పుడు ఆడియోలను సృష్టించి వాటిని మీడియాలో వచ్చేటట్లు చేసి డీహెచ్ ప్రతిష్టకు భంగం కలిగించేందుకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అవినీతికి పాల్పడే అధికారులు ఏ స్థాయిలో ఉన్నా సహించేది లేదని, అదే విధంగా నిజాయితీగా సంక్షేమం కోసం పని చేసే అధికారులపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వారు హెచ్చరించారు. సమావేశంలో మెడికల్ జాక్ నాయకులు కిరణ్‌రెడ్డి, సకల రెడ్డి, జ్ఞానేశ్వర్, బీసీ శ్రీనివాస్, ఖలీమోద్దీన్, పాండు నాయక్, తిరుపతి నాయక్, రాజశేఖర్, శిరీష, జమాలుద్దీన్, దేవ్ సింగ్, అనిల్ కుమార్, హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జింగ్ టెక్నాలజీతోనే అవకాశాలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): ఎమర్జింగ్ టెక్నాలజీ అయినా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషీన్ లెర్నింగ్‌లో నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే ఐటీ రంగంలో ఉన్నత ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఎస్కీ) డైరెక్టర్ డా.రామేశ్వర్ రావు అన్నారు. ఎస్కీ, శ్రీనిధి టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహిస్తున్న జాబ్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించింది. ప్రధానమంత్రి కుశల్ వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, నిరుద్యోగుల్లో స్కిల్ డెవలప్‌మెంట్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు రామేశ్వర్‌రావు వివరించారు. కార్యక్రమంలో శ్రీనిధి విద్యా సంస్థల డైరెక్టర్ డా.సీవీ టోమీ, డా.టీవీ రజనీకాంత్, సాయికిషోర్, డా. కుమారస్వామి, డా.ప్రవీన్, తదితరులు బోధన సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజిక్స్ బోధకులకు టీఐఎఫ్ఆర్‌హెచ్, హెచ్‌సీయూ శిక్షణ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): ఫిజిక్స్ బోధించే ఉపాధ్యాయులకు టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్‌హెచ్), హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలు సంయుక్తంగా ప్రత్యేక శిక్షణ నిర్వహించాయి. హైదరాబాద్ యూనివర్సిటీలో జరిగిన ఈ ఓరియెంటేషన్ బోధనలో మెళకువలపై అవగాహన కల్పించారు. విజ్ఞాన శాస్త్రంపై విద్యార్థులకు ఆసక్తిని పెంచేలా పాఠ్యాంశాల బోధనకు ఈ శిక్షణ సాయపడుతుందని టీఐఎఫ్ఆర్‌హెచ్ వర్గాలు వెల్లడించాయి. శిక్షణలో భాగంగా నూతన విద్యావిధానం, ప్రాక్టీకల్ మెథడాలజీలపై టీచర్లకు అవగాహన కల్పించారు.

నేషనల్ బర్న్స్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రతినిధులు

విజయవంతంగా నేషనల్ బర్న్స్ కాన్ఫరెన్స్

- నగరానికి మూడు బహుమతులు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 20: రాంచీలో నిర్వహించిన నేషనల్ బర్న్స్ కాన్ఫరెన్స్ ఎన్ఏబీఐసీఓఎన్-24 సదస్సు విజయవంతంగా ముగిసినట్లు ఉస్మానియా ప్లాస్టిక్ సర్జరీ ప్రొఫెసర్, ఎన్ఏబీఐ ఈసీ మెంబర్ డాక్టర్ పలుకూరి లక్ష్మి తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్ కోసం బీబీనగర్, మంగళగిరి ఎయిమ్స్ నుంచి డాక్టర్ రోహిత్, డాక్టర్ లిఖిత్ రెడ్డిల సహకారంతో దేశంలోని తొలిసారి ఈ తరహా సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సదస్సుకు నగరంలోని నిమ్స్ నుంచి పీజీ స్టూడెంట్స్ డాక్టర్ భూలక్ష్మి, డాక్టర్ కోవిదలు పాల్గొనగా వారికి ప్రథమ బహుమతి, గాంధీ మెడికల్ కాలేజ్ స్టూడెంట్ డాక్టర్ ప్రియాంకకు పీజీ బెస్ట్ పేపర్ సెషన్‌లో ద్వితీయ బహుమతి దక్కినట్లు తెలిపారు. ఈ సదస్సులో దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 40 మంది పీజీ స్టూడెంట్స్, 30 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐ హబ్ డేటా కేంద్రంలో ఏఐ, ఎంఎల్ టెక్నాలజీల్లో శిక్షణ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 20(నమస్తే తెలంగాణ): గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థలోని ఐ హబ్ డేటా కేంద్రం ఆధ్వర్యంలో ఏఐ, ఎంఎల్ టెక్నాలజీల్లో శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఐ హబ్ డేటా ప్రతినిధి డాక్టర్ సీకే రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు హైదరాబాద్ చుట్టు పక్కల ఉన్న విద్యా సంస్థలతో కలిసి పనిచేసేలా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. అందులో 5 నెలల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమం ఏఐ, ఎంఎల్ టెక్నాలజీల్లో ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్: 040-66531787లో, అదే విధంగా ఐ హబ్ డేటా వెబ్‌లో సంప్రదించాలని సూచించారు.

పంజాబ్ రైతులు ఢిల్లీకి వచ్చే అధికారం లేదా?

జస్టిస్ చంద్రకుమార్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 20: రైతులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వచ్చే అధికారం లేకుండా చేస్తున్నారని, పంజాబ్ రైతుల విషయంలో కేంద్రం అదే తీరును అనుసరిస్తోందని తెలంగాణ రైతు సంక్షేమ సమితి అధ్యక్షులు జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రైతు సంక్షేమ సమితి సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వోర్సు ఇంద్రసేన అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ, 2014లోనే బీజేపీ తన మ్యానిఫెస్టోలో రైతులకు కనీస మద్దతు ధర ఇస్తామని పేర్కొని, ఆ మాట తప్పినందుకే నేడు రైతాంగం ఉద్యమ బాట పట్టారని తెలిపారు. పదేండ్లలో దేశంలో ఏడున్నర లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, స్వాతంత్య్రం వచ్చి 75 ఏండ్లు దాటుతున్నా ఇంకా రైతుల ఆత్మహత్యలు జరుగడం అత్యంత బాధాకరమన్నారు. సమావేశంలో జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్దన్, కరుణాకర్ దేశాయి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, బీసీ ఉద్యమ నాయకులు జనార్దన్, జాగో తెలంగాణ నాయకులు పృథ్వీరాజ్, సినీ దర్శకులు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

లా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 20: లా కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ పరీక్షల విభాగం కంట్రోలర్, ప్రొఫెసర్ రాములు తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీ కామ్ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును మార్చి 19 వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని.. రూ.200 అపరాధ రుసుముతో మార్చి 27వరకు చెల్లించవచ్చన్నారు.

ట్రాఫికింగ్ రెస్క్యూలో సాంకేతికత అవసరం

ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమా రాజేశ్వరి



హైదరాబాద్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ) : హ్యూమన్ ట్రాఫికింగ్, తప్పిపోయిన చిన్నారులను గుర్తించేందుకు అన్ని సాంకేతికతలను వాడాలని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమా రాజేశ్వరి కోరారు. హైదరాబాద్‌లోని తాజ్ వివంతలో మంగళవారం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, గవర్నమెంట్ రైల్వే ఫోర్స్, యూఎస్ కాన్సులేట్, బచ్ పన్ బచావ్ ఆందోళన్‌ల సహకారంతో ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో 'హ్యూమన్ ట్రాఫికింగ్ అండ్ తప్పిపోయిన వ్యక్తులను గుర్తించడం' అనే అంశంపై నిర్వహించిన ఒక రోజు శిక్షణలో ఆమె మాట్లాడుతూ.. ఉమెన్ సేఫ్టీ వింగ్ ఏడీజీ శిఖా గోయెల్ మార్గనిర్దేశంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ చిత్తశుద్ధితో పనిచేస్తుందని అభినందించారు. తెలంగాణ మహిళా భద్రతా విభాగం.. యూనిసెఫ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ, ప్రభుత్వ రంగ సంస్థలు అంతర్జాతీయ సంస్థలతో కలిసి పనిచేస్తేనే మానవ అక్రమ రవాణా సమస్యను అధిగమించొచ్చని తెలిపారు. కార్యక్రమంలో యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, అరోమా సింగ్ ఠాకూర్, దేబేస్మిత సి బెనర్జీ, ఎరిన్ ఫిషర్, బచ్ పన్ బచావో స్టేట్ కోఆర్డినేటర్ ఉమెన్ సేఫ్టీ వింగ్‌లోని ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.